క్లుప్తంగా

ఆరోగ్య జ్యోతికి జాతీయ స్థాయి అవార్డు



బోధన్: బోధన్‌కు చెందిన ఆరోగ్య జ్యోతి చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకురాలు, ప్రస్తుతం బాన్సువాడ ఏరియా ప్రభుత్వాస్పత్రిలో హెడ్‌నర్సుగా విధులు నిర్వర్తిస్తున్న ఆరోగ్య జ్యోతి నేషనల్ ఫ్లోరెన్స్ నైటింగేల్ అవార్డు దక్కింది. ఇంటర్నేషనల్ నర్సెస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉత్తమ వైద్య సేవలందిస్తున్న వివిధ రాష్ట్రాలకు చెందిన నర్సులను అవార్డుకు ఎంపిక చేశారు. కర్నాటక రాష్ట్రానికి చెందిన ఓ ప్రముఖ మీడియా సంస్థ అవార్డులను ప్రదానం చేసింది. మంగళవారం బెంగళూర్‌లో ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా ఆరోగ్య జ్యోతి అవార్డును అందుకున్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.51 వేల విరాళం



రుద్రూర్: కోటగిరి మండలం సుద్దులం తండాలో నూతనంగా నిర్మించనున్న సేవాలాల్ మహరాజ్ ఆలయ నిర్మాణానికి రూ.51 వేలు చందూర్ మండల జెడ్పీటీసీ అంబర్ సింగ్ విరాళంగా అందజేశారు. ఆయన వెంట కోటగిరి మండల కాంగ్రెస్ అధ్యక్షులు షాహిద్, వర్ని మండల కాంగ్రెస్ అధ్యక్షులు సురేష్ బాబా , నాయకులు ప్రకాష్ బాబా, తదితరులు పాల్గొన్నారు.

సదరం సర్టిఫికెట్ల పంపిణీ



భీమ్‌గల్: ఐకేపీ ఆధ్వర్యంలో ఎంపీపీ ఆర్మూర్ మహేశ్, జెడ్పీటీసీ చౌట్‌పల్లి రవిలు మండలంలోని పలు గ్రామాలకు చెందిన 15 మంది దివ్యాంగులకు మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సదరం సర్టిఫికెట్‌లు పంపిణీ చేశారు. ఎంపీపీ ఆర్మూర్ మహేశ్, జెడ్పీటీసీ చౌట్‌పల్లి రవిలు మాట్లాడుతూ.. వికలాంగుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఎంపీడీవో రాజేశ్వర్, ఏపీఎం కుంట శ్రీనివాస్, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు దొన్కంటి నర్సయ్య పాల్గొన్నారు.

సేవలకు దక్కిన ప్రశంసా పత్రం



పెర్కిట్(ఆర్మూర్): తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆర్మూర్ పట్టణంలోని ఆధార్ కేంద్రం నిర్వాహకుడు షాహిద్‌కు జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు, జెడ్పీ చైర్మన్ విఠల్ రావు మంగళవారం ప్రశంసా పత్రాన్ని అందజేశారు. ఐటీ శాఖ మంగళవారం నిర్వహించిన పారిశ్రామిక ప్రగతి ఉత్సవం కార్యక్రమంలో జిల్లాలో అత్యధిక లావాదేవీలు నిర్వహించిన ఆధార్ కేంద్రం కావడంతో నిర్వాహకుడు షాహిద్‌కు ప్రశంసా పత్రం అందజేశారు.

ప్రభుత్వ బడుల్లోనే చేర్పించండి



రెంజల్/వేల్పూర్/రుద్రూర్: ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా ఉపాధ్యాయులు మంగళవారం గ్రామాల్లో ఇంటింటికి తిరుగుతూ బడి బయటి పిల్లల వివరాలను సేకరించారు. తల్లిదండ్రులతో మాట్లాడి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని విన్నవించారు. పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు అంగీకరించినట్లు ఉపాధ్యాయులు తెలిపారు. రెంజల్ మండలం దూపల్లి, వేల్పూర్ మండలం పడగల్, మోస్రాల్ మండలం గోవూర్‌లలో బడి బాట కార్యక్రమం నిర్వహించారు.

పోగొట్టుకున్న ఫోన్ అప్పగింత



నందిపేట్(ఆర్మూర్): ఫోన్‌ను పోగొట్టుకున్న బాధితుడికి సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ట్రాక్ చేసి పట్టుకుని బాధితునికి నందిపేట ఎస్సై శ్రీకాంత్ అందజేశారు. సిరికొండ మండలానికి చెందిన మలావత్ సంతోష్ 10 రోజులు క్రితం వన్నెల్ కే గ్రామానికి సొంత పనుల నిమిత్తం రాగా ఆయన మొబైల్‌ను దొంగిలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని పోర్టల్ ద్వారా గుర్తించి బాధితుడికి మంగళవారం అందించారు.

మొండి బిల్లులకు మోక్షం కలిగేనా?

- రూ.8 కోట్లకు పైగా పెండింగ్ బిల్లులు
- ఏడాదిన్నరగా కాంట్రాక్టర్ల ఎదురుచూపులు



బోధన్‌టౌన్(బోధన్): రెండో విడత పట్టణ ప్రగతిలో చేపట్టిన పనుల బిల్లులు మొండి బకాయిలుగా మారాయి. ఈ బిల్లులకు మోక్షం ఎప్పుడా అని కాంట్రాక్టర్లు ఏడాదిన్నరగా ఎదురు చూస్తున్న వైనం బోధన్ మున్సిపాలిటీలో నెలకొంది. బోధన్ మున్సిపాలిటీ పరిధిలో 38 వార్డులు ఉన్నాయి. ఈ వార్డులతో పాటు బల్దియా పరిధిలో ప్రభుత్వం చేపట్టే వివిధ అభివృద్ధి పనులు చేయడానికి 25 మంది కాంట్రాక్టర్లు ఉన్నారు. ఏళ్ల తరబడిగా కాంట్రాక్టర్లు బల్దియా పరిధిలో చేపట్టే వివిధ అభివృద్ధి పనులు చేస్తున్నారు. గడిచిన ఏడాదిన్నర కాలంలో పట్టణ ప్రగతితో పాటు 15వ ఆర్థిక సంఘం నిధులతో బల్దియా అధికారులు చేయాలని సూచించిన వైకుంఠధామాల అభివృద్ధి పనులు, సీసీ రోడ్లు, సీసీ డ్రైనేజీల నిర్మాణాలు, ప్రహరీ నిర్మాణ పనులను ప్రారంభించి పూర్తి చేశారు. చేసిన అభివృద్ధి పనులకు ఎంబీ రికార్డులు సైతం పూర్తి చేసి అకౌంట్ సెక్షన్‌లో అప్పగించారు. అధికారులు అప్పజెప్పిన పనులను పూర్తి చేసి ఏడాదిన్నర గడుస్తున్నా, బిల్లుల్లో చిల్లి గవ్వ రాకపోవడంతో ఆర్థికంగా కాంట్రాక్టర్లు కష్టాలు ఎదుర్కొంటున్నారు. తమకు బిల్లులు చెల్లించాలని బల్దియా కమిషనర్‌తో పాటు, చైర్‌పర్సన్‌లతో మొర పెట్టుకున్నా ఫలితం లేకుండా పోయింది. కార్యాలయం, అధికారుల చుట్టూ కాళ్లు అరిగేదాక తిరిగినా ఫలితం లేకుండా పోవడంతో చేసేది లేక బల్దియా కార్యాలయం ఎదుట ధర్నాలు చేసి అధికారులకు వినతి పత్రాలను సైతం అందించారు. చేసిన పనులకు బిల్లులు వస్తే తెచ్చిన అప్పులు కట్టి కష్టాల నుంచి బయటపడొచ్చని కాంట్రాక్టర్లు ఎదురు చూస్తున్నా రు.

బిల్లుల కోసం ఎదురుచూపులు

బోధన్ బల్దియా పరిధిలో పలు అభివృద్ధి పనులను చేపట్టి పూర్తి చేశాం. ఏడాదిన్నరగా బిల్లుల కోసం ఎదురు చూస్తున్నాము. ప్రభుత్వం స్పందించి బిల్లులు మంజూరు చేసి కాంట్రాక్టర్లను ఆదుకోవాలి.

– ఉదయ్ భాస్కర్, బోధన్ మున్సిపాలిటీ కాంట్రాక్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు

అధికారుల దృష్టికి తీసుకెళ్లాం

బల్దియా పరిధిలో కాంట్రాక్టర్లు చేసిన అభివృద్ధి పనుల బిల్లుల మంజూరు అంశం ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. బిల్లుల మంజూరు కోసం చర్యలు చేపడుతున్నాము.

– ఖమర్ అహ్మద్, మున్సిపల్ కమిషనర్

పారిశ్రామిక ప్రగతి ఉత్సవాలు ఎవరి కోసం?



ఎన్డీఎస్ఎల్ ఎదుట నిరసన తెలుపుతున్న కార్మికులు

బోధన్ : నిజాంషుగర్ ఫ్యాక్టరీని తెరిపించకుండా, ఉపాధి కోల్పోయి ఆకలితో అలమటిస్తుంటే పారిశ్రామిక ప్రగతి ఉత్సవాలు ఎవరి కోసం నిర్వహిస్తున్నారని కార్మిక సంఘాల నేతలు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం పారిశ్రామిక ప్రగతి ఉత్సవాలు నిర్వహిస్తున్న నేపథ్యంలో మంగళవారం ఎన్డీఎస్ఎల్ ప్రధాన గేట్ ఎదుట కార్మికులు నిరసన కార్యక్రమం చేపట్టారు. స్వరాష్ట్ర పాలనలో ఫ్యాక్టరీ ప్రభుత్వపరమై, మా బతుకులు బాగు పడతాయని ఆశపడ్డామని, కాని నడిచే ఫ్యాక్టరీని యాజమాన్యం అక్రమంగా లేఆఫ్ ప్రకటించి మూసివేసినా ప్రభుత్వం పట్టించుకోకుండా తీరని అన్యాయం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఫ్యాక్టరీకి చెందిన స్థలాన్ని ఆక్రమించుకునేందుకు త్వరలోనే కార్యాచరణను ప్రకటిస్తామని వెల్లడించారు. కార్మిక సంఘాల నాయకులు నాగేశ్వర్‌రావు, బాలక్రిష్ణ, శ్రీనివాస్, ఉపేందర్ పాల్గొన్నారు.

ఆర్మూర్ గడ్డపై బీజేపీ జెండా ఎగరేస్తాం

బీజేపీ నేత పైడి రాకేష్‌రెడ్డి



నందిపేటలో అభివాదం చేస్తున్న పైడి రాకేష్‌రెడ్డి

నందిపేట్(ఆర్మూర్): ఈ జీవితం ఆర్మూర్‌కు అంకితమని, ఆర్మూర్ గడ్డపై బీజేపీ జెండా ఎగురవేయడం ఖాయమని బీజేపీ నాయకులు పైడి రాకేష్ రెడ్డి అన్నారు. బీజేపీ పార్టీలో చేరిన తర్వాత మొదటిసారిగా ఆర్మూర్ మీదుగా నందిపేట వచ్చిన సందర్భంగా రాకేష్‌రెడ్డికి మండల బీజేపీ శ్రేణులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం నందిపేటలోని వివేకానంద చౌరాస్తాలో ఎంపీ అరవింద్, పైడి రాకేష్‌రెడ్డి వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పైడి రాకేష్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎంపీ అరవింద్ ఆధ్వర్యంలో ఆర్మూర్‌లో బీజేపీ గెలుపు ఖాయమన్నారు. ఎమ్మెల్సీ కవిత ఆర్మూర్‌లో ఎమ్మెల్యేగా పోటీ చేయడమంటే మైసమ్మ ముందు మేకపోతు బలి అనడం వారి అహంకారానికి నిదర్శనమని దుయ్యబట్టారు. అనంతరం ఎంపీ అరవింద్ మాట్లాడుతూ.. ఎంపీ కవిత తనపై మాత్రమే పోటీ చేయాలని గతంలో మాదిరిగా మైసమ్మ ముందు పొట్టేలు కావాలని ఎద్దేవా చేశారు. పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లె గంగారెడ్డి, నూతుల శ్రీనివాస్ రెడ్డి, మండల నాయకులు పాల్గొన్నారు.

మాక్లూర్‌లో ఘన స్వాగతం

మాక్లూర్ : పారిశ్రామిక వేత్త పైడి రాకేష్‌రెడ్డికి మంగళవారం మాక్లూర్‌లో బీజేపీ నాయకులు భారీ స్వాగతం పలికారు. మండల పార్టీ నాయకుడు కాలగడ్డ వినోద్, సీనియర్ నాయకుడు గంగోనే సంతోష్, తదితరులు నందిపేట వైపు నుంచి వచ్చి మాదాపూర్ వద్ద స్వాగతం పలికి ర్యాలీలో పాల్గొన్నారు. మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద ఉన్న బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా రాకేష్ రెడ్డి మాట్లాడుతూ.. బడుగు బలహీన వర్గాల సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతానని చెప్పారు.

రామాలయంలో పూజలు

డొంకేశ్వర్(ఆర్మూర్): బీజేపీలో చేరిన పైడి రాకేశ్ రెడ్డి మొదటిసారి ఆర్మూర్ నియోజకవర్గంలోని డొంకేశ్వర్ మండలంలో మంగళవారం ఎంపీ అర్వింద్‌తో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా బీజేపీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. రాకేశ్‌రెడ్డి సతీ సమేతంగా రామాలయంలో పూజలు నిర్వహించారు.

పెద్ద ఎత్తున పనులు కల్పించాలి



మాట్లాడుతున్న డీఆర్‌డీవో చందర్ నాయక్

పెర్కిట్(ఆర్మూర్): రానున్న సీజన్‌లో ఉపాధి హామీ పథకంలో కూలీలకు పెద్దఎత్తున పనులు కల్పించాలని జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ అధికారి(డీఆర్‌డీవో) చందర్ నాయక్ సూచించారు. ఆర్మూర్ మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం 14వ విడత ఉపాధి హామీ సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమంలో నాలుగేళ్లలో మండలంలో రూ.18 కోట్ల పనులు చేపట్టినట్లు అధికారులు గుర్తించారు. ఈ సందర్భంగా డీఆర్‌డీవో మాట్లాడుతూ.. గత సంవత్సరం హరితహారం కార్యక్రమంలో నాటిన మొక్కల్లో 20 శాతం మొక్కలు చనిపోయినట్లు గుర్తించినట్లు తెలిపారు. వాటి స్థానంలో మరిన్ని కొత్త మొక్కలు నాటాలన్నారు. విజిలెన్సు అధికారి నారాయణ, అంబుడ్స్‌మెన్ శ్రీనివాస్, ఎంపీపీ పస్క నర్సయ్య, ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతి



బోధన్‌రూరల్(బోధన్): సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏఎంసీ వైస్ చైర్మన్ ఎండీ షకీల్ ఆధ్వర్యంలో సాలూర మండల కేంద్రానికి చెందిన పలువురు మైనారిటీ నేతలు బోధన్‌లో ఎమ్మెల్యే షకీల్ ఆమేర్‌ను కలిశారు. షాదీఖానా నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని వినతి పత్రం అందజేశారు. ఎమ్మెల్యే షకీల్ సానుకూలంగా స్పందించి నిధులు మంజూరు చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మైనారిటీ నేతలు షేక్ మౌలానా, షేక్ జాఫర్, రహీముద్దీన్, సయ్యద్ ఖాదర్, షేక్ అజీజ్, షేక్ వాయిద్, తదితరులున్నారు.

'కమీషన్లపై ఉన్న శ్రద్ధ పేదవారిపై లేదు'



మోర్తాడ్: బాల్కొండ నియోజకవర్గంలో అధికార పార్టీ నేతలకు కమీషన్లు దండుకోవడంపై ఉన్న శ్రద్ధ కష్టాల్లో ఉన్నవారిపై కనికరం చూపే సమయం లేదని ఆరెంజ్ ట్రావెల్స్ అధినేత ముత్యాల సునీల్ రెడ్డి విమర్శించారు. సుంకెట్‌లో షార్ట్ సర్క్యూట్‌తో ఇంటిని, సామగ్రిని కోల్పోయిన వడ్ల మాదయ్యకు నష్ట పరిహారం ఇప్పించే శ్రద్ధ బీఆర్‌ఎస్ నాయకులకు లేకపోవడంపై ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. మంగళవారం మాదయ్య కుటుంబాన్ని పరామర్శించి రూ.20వేల ఆర్థిక సాయం అందించారు. మాదయ్యకు జరిగిన నష్టంపై అధికారులు స్పందించి సాయం అందించేలా చొరవ తీసుకోవాలని కోరారు.

ప్రభుత్వానికి నైతిక హక్కు లేదు



వినతి పత్రం అందిస్తున్న నాయకులు

బోధన్: ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా దశాబ్ది ఉత్సవాలు జరుపుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి నైతిక హక్కు లేదని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా డివిజన్ సహాయ కార్యదర్శి మల్లేశ్ విమర్శించారు. పార్టీ రాష్ట్ర కమిటీ జూన్ 2 నుంచి 12 వరకు రాష్ట్ర అవతరణ దినోత్సవం నేపథ్యంలో దీక్షా దివస్ కార్యక్రమాలు చేపట్టాలని పిలుపు నిచ్చింది. ఇందులో భాగంగా మంగళవారం పట్టణ కేంద్రంలో ర్యాలీ నిర్వహించి ఆర్డీవో ఆఫీసు ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం ఏవో ముంతాజుద్దీన్‌కు వినతి పత్రం అందించారు. అర్హులైన పేదలకు డబుల్ బెడ్ రూం ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, డిమాండ్ చేశారు.

బీఆర్ఎస్‌లో మళ్లీ ఫ్లెక్సీ వివాదం

- ఫ్లెక్సీల్లో చైర్‌పర్సన్ ఫొటో మిస్సింగ్
- ఎమ్మెల్యే షకీల్ వర్సెస్ మున్సిపల్ చైర్‌పర్సన్ భర్త శరత్ రెడ్డి



బోధన్: బోధన్ బీఆర్ఎస్ ముఖ్య ప్రజాప్రతినిధుల మధ్య మళ్లీ ఫ్లెక్సీల్లో ఫొటోల వివాదం నెలకొంది. స్థానిక ఎమ్మెల్యే షకీల్, మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మ భర్త కౌన్సిలర్ శరత్ రెడ్డిల మధ్య కొంతకాలంగా విభేదాలు పొడసూపుతున్నాయి. తాజాగా తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా విద్యుత్ ప్రగతి సభను సోమవారం ఓ ఫంక్షన్ హాల్‌లో అధికారికంగా నిర్వహించారు. ఎమ్మెల్యే షకీల్‌తో పాటు ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. సభావేదికపై ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఫొటో వేయలేదు. ప్రొటోకాల్ ప్రకారం అధికారులు సభలో మున్సిపల్ చైర్‌పర్సన్‌ను వేదికపై ఆహ్వానించారు. కాని ఆమె సభకు హాజరుకాలేదు. ఫ్లెక్సీలో చైర్‌పర్సన్ ఫొటో లేకపోవడం చర్చకు దారి తీసింది.ఈ విషయం మంగళవారం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

అభివృద్ధిపై చర్చకు సిద్ధమా?

- ఎమ్మెల్యే జీవన్ రెడ్డి



పార్టీలో చేరుతున్న వారితో ఎమ్మెల్యే జీవన్ రెడ్డి

పెర్కిట్(ఆర్మూర్): నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిపై బీజేపీ, కాంగ్రెస్ నాయకులు బహిరంగ చర్చకు సిద్ధంగా ఉన్నారా అని ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి సవాలు విసిరారు. అంకాపూర్‌లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో నందిపేట మండలం వెల్మల్, కౌల్‌పూర్, పిప్రి, మాక్లూర్ మండలాలకు చెందిన పలువురితో పాటు కాంగ్రెస్, బీజేపీ నాయకులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారిని ఎమ్మెల్యే బీఆర్ఎస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎంపీ అర్వింద్ తనపై పోటీచేస్తే డిపాజిట్ కూడా దక్కదన్నారు. నియోజకవర్గంలోని 62 వేల మందికి రైతులకు రైతుబంధు ద్వారా పెట్టుబడి సాయం అందజేస్తున్నట్లు తెలిపారు. అలాగే 12 వందల మందికి దళిత బంధు పథకంలో రూ.10 లక్షల చొప్పున మంజూరు చేసి ఉపాధి కల్పించామన్నారు. హ్యాట్రిక్ విజయం సాధిస్తానని ధీమా వ్యక్తం చేశారు. నాయకులు పూజ నరేందర్, ఆలూర్ శ్రీనివాస్ రెడ్డి, సుదర్శన్, భోజా రెడ్డి, హేమంత్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రూ. 1.60 కోట్ల రుణాలు ఇవ్వాలి



మాక్లూర్: ఇంటి దీపం సంఘంలోని సభ్యులకు ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.1.60 కోట్ల రుణాలు ఇవ్వాలని మంగళవారం సంఘ భవనంలో మండల అధ్యక్షురాలు బోపతి చిన్నమ్మ అధ్యక్షతన జరిగిన 23వ మహాజన సభలో తీర్మానం చేశారు. మండలంలోని 26 గ్రామాలకు చెందిన సంఘ సభ్యులు హాజరుకాగా మేనేజర్ ప్రభాకర్ సంవత్సర కాలంగా కొనసాగిన లావాదేవీలను సభ్యులకు చదివి వినిపించారు. గత ఆర్థిక సంవత్సరం సభ్యుల అవసరాల కోసం రూ. కోటి 46 లక్షలు రుణాలు ఇవ్వగా వడ్డీల రూపంలో 20 లక్షల మిగులు వచ్చిందన్నారు. ఈ సంవత్సరం మరో 50 సంఘాలను కొత్తగా తయారు చేయాలని తీర్మానం చేశారు. కార్యక్రమంలో డిచ్‌పల్లి ఇంటి దీపం అధ్యక్షురాలు రాజమణి, మాక్లూర్ ఇంటి దీపం సభ్యులు చంద్రకళ, ఉషారాణి, తదితరులు పాల్గొన్నారు.

మోస్రాలో రాజకీయ పార్టీలతో సమావేశం



మాట్లాడుతున్న తహసీల్దార్ సాయిలు

రుద్రూర్: పద్దెనిమిదేళ్లు నిండిన యువతీ యువకులు ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవాలని మోస్రా తహసీల్దార్ సాయిలు తెలిపారు. స్థానిక తహసీల్ కార్యాలయంలో మంగళవారం సీపీఎం, కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ నాయకులతో సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో బీఎల్‌వోలు ఓటరు నమోదు చేపట్టారని, రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని కోరారు. ఓటరు జాబితాలో తప్పులుంటే సరి చేసుకోవచ్చునని సూచించారు. సమావేశంలో సీపీఎం నేతలు నన్నే సాబ్, మేకల మల్లేష్, కాంగ్రెస్ నేత సైనాపురం నర్సారెడ్డి, బీజేపీ నాయకులు సాయిలు, లింగం, బీఆర్ఎస్ నాయకుడు గోపిరెడ్డి పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం..

సిద్ధాపూర్‌లో బోగ్ బండార్



వర్ని: సిద్ధాపూర్‌లో బాలాజీ, జగన్నాథ స్వామి, గురునానక్ దేవతలకు బోగ్ బండార్ కార్యక్రమాన్ని గిరిజనులు నిర్వహించారు. దేవతలకు నైవేద్యాన్ని సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు.

ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం

రుద్రూర్: మండల కేంద్రం శివారులోని ఎల్లమ్మ పంపు వద్ద నూతనంగా నిర్మించిన ఆలయంలో పుట్ట ఎల్లమ్మ దేవి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం వైభవంగా నిర్వహించా రు. యజ్ఞం నిర్వహించా రు. ముఖ్య అతిథులుమల్లారం శ్రీకృష్ణ మహరాజ్, కందకుర్తి శ్రీ సీతారాంజీ మహరాజ్‌ల ఆధ్వర్యంలో దేవి విగ్రహ, శిఖర ప్రతిష్ఠాపన కార్యక్రమాలు కొనసాగాయి. ఈ సందర్భంగా వారు భక్తులకు ప్రవచనం చేశారు.



అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రాణప్రతిష్ఠ

రుద్రూర్ మండలం అక్బర్‌నగర్ మల్లయ్య గుట్ట సమీపంలోని మంగళారంపేట శివారులో అభయాంజనేయ స్వామి విగ్రహ పునఃప్రాణప్రతిష్ఠ కార్యక్రమాన్ని మంగళవారం రైతులు ఘనంగా నిర్వహించారు. హోమం చేసి అనంతరం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

సమాచారం..

నేడు సాగునీటి దినోత్సవం

బోధన్‌రూరల్(బోధన్): దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నేడు తెలంగాణ సాగు నీటి దినోత్సవం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే షకీల్ క్యాంపు కార్యాలయం ప్రతినిధులు, ఇరిగేషన్ శాఖ అధికారులు మంగళవారం తెలియజేశారు. పట్టణంలోని అప్నా ఫంక్షన్ హాల్‌లో బుధవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు కార్యక్రమం జరుగుతుందని, ఎమ్మెల్యే మహ్మద్ షకీల్ ముఖ్య అతిథిగా విచ్చేస్తారని తెలిపారు.

8న సిద్ధాపూర్‌లో..

వర్ని: సిద్ధాపూర్‌లో సాగునీటి దినోత్సవం నిర్వహించనున్నట్లు వర్ని ఎంపీడీవో బషీరుద్దీన్ వెల్లడించా రు. కార్యక్రమానికి స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి హాజరుకానున్నట్లు ఆయన తెలిపారు.

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్

స్క్రీన్-1 –	ఫాస్ట్ ఎక్స్-3డీ (తెలుగు) 1.00 చక్రవ్యూహం - 4.00 అహింస - 6.30 బిచ్చగాడు (2) - 9.55
స్క్రీన్-2 –	బిచ్చగాడు(2) - 12.20 మేమ్‌ఫేమస్-3.35, పరేషాన్- 6.45 2018 - 9.40
స్క్రీన్-3 –	అహింస- 12.35 ; 2018 - 4.00 నేను స్టూడెంట్ సర్ - 7.10, 10.00
స్క్రీన్-4 –	మేమ్‌ఫేమస్ - 12.25 స్పైడర్‌మాన్ (తె) - 3.35, 9.45 ; (ఇంగ్లిష్) - 6.40

సంక్షిప్తం

బీఆర్ఎస్‌లో చేరికలు

డొంకేశ్వర్(ఆర్మూర్): సిర్పూర్‌నకు చెందిన బీజేపీ వార్డు మెంబర్ రొడ్డ రాజు, కాంగ్రెస్ నాయకులు మంగళవారం బీఆర్ఎస్‌లో చేరారు. హైదరాబాద్‌లో ఎమ్మెల్యే జీవన్‌రెడ్డిని కలిసి పార్టీ కండువా కప్పుకున్నారు. సిర్పూర్ సర్పంచ్ శ్రీను, తదితరులున్నారు.

సామూహిక సీమంతాలు

పెర్కిట్(ఆర్మూర్): మండలంలోని పిప్రిలో మంగళవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గర్భిణీలకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. అనంతరం అంగన్వాడీ కేంద్ర ఆవరణలో మొక్కలను నాటారు. పిప్రి సెక్టారు సూపర్‌వైజర్ వెంకటరమణమ్మ అంగన్వాడీ టీచర్లు రాణి, గంగుబాయి పాల్గొన్నారు.

దశాబ్ది ఉత్సవాలకు హాజరు కావాలి

వేల్పూర్: తెలంగాణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా ఈ నెల 8న జరిగే పెద్ద చెరువుల పండుగకు మహిళా సంఘాల సభ్యులు బోనాలతో భారీగా హాజరై విజయవంతం చేయాలని ఐకేపీ సీసీ రవి కోరారు. అక్లూర్‌లో మంగళవారం మహిళాసంఘాలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. గ్రామ సంఘం అధ్యక్షురాలు హారిక పాల్గొన్నారు.

ధర్నా విజయవంతం చేయండి

భీమ్‌గల్: తెలంగాణ ప్రజల ఆకాంక్షలు నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ ప్రజాపంథా ఆధ్వర్యంలో జూన్ 12 వరకు నిర్వహించే ధర్నా కార్యక్రమాలను విజయవంతం చేయాలని సీపీఐఎంఎల్ ప్రజాపంథా మండల అధ్యక్షుడు రాజేశ్వర్ కోరారు. ఈ మేరకు మంగళవారం పార్టీ నాయకులతో కలిసి భీమ్‌గల్‌లో కరపత్రాలు పంపిణీ చేశారు. నాయకులు అరవింద్, సతీష్, ఒడ్డెన్న పాల్గొన్నారు.

హెగ్డోలిలో కంటి వెలుగు శిబిరం ప్రారంభం

రుద్రూర్: పోతంగల్ మండలం హెగ్డోలిలో ఏర్పాటు చేసి కంటి వెలుగు శిబిరాన్ని గ్రామ సర్పంచ్ వెంకాగౌడ్ ప్రారంభించారు. ఎంపీటీసీ ఉమా రాంబాబు, పంచాయతీ కార్యదర్శి జగదీష్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వడదెబ్బ తగలకుండా జాగ్రతలు పాటించాలి



పెర్కిట్(ఆర్మూర్): ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో వడదెబ్బ నుంచి కాపాడుకోవాడానికి ప్రతి ఒక్కరు జాగ్రత్తలు పాటించాలని ఆరోగ్య కార్యకర్త జక్కుల మోహన్ సూచించారు. మామిడిపల్లి ఆరోగ్య ఉప కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను అందజేశారు. ఈ సందర్భంగా జక్కుల మోహన్ మాట్లాడుతూ.. చమట పట్టకుండా చర్మం ఎరుపుదేలడం, వేడెక్కడం, పొడిబారి పోవడం, శ్వాస తీసుకోవడం కష్టంగా మారడం, స్పృహ కోల్పోవడం, అలసట, వికారం, వాంతులు, తలనొప్పి వంటి లక్షణాలు ఉంటే వడదెబ్బగా గుర్తించాలన్నారు. అలాంటి పరిస్థితుల్లో లీటరు మంచి నీటికి ఒక ఓఆర్‌ఎస్ ప్యాకెట్ కలుపుకుని రోజంతా తీసుకోవాలని సూచించారు.

భూమన్నపై చర్యలు తీసుకోండి

భీమ్‌గల్: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన మోతె భూమన్నపై చర్యలు తీసుకోవాలని భీమ్‌గల్ దళిత ఐక్య సంఘటన నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం భీమ్‌గల్ ఎస్సై రాజ్ భరత్ రెడ్డికి ఫిర్యాదు చేశారు. నాయకులు గడాల ప్రసాద్, రవీందర్, మేకల శ్రీనివాస్, బాగేష్, సంజీవ్, తదితరులు పాల్గొన్నారు.